సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్ భాస్కర్ తెలిపారు. హర్రాజ్‌పెంట ఫీడర్ పరిధిలో హర్రాజ్‌పెంట, సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, క్రిమటోరియం తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, గోల్నాక చర్చి, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మౌలానా ఆజాద్ నగర్ ఫీడర్ పరిధిలో చప్పల్‌బజార్, మౌలానా ఆజాద్‌నగర్, కుమార్ థియేటర్, రహమత్‌బాగ్, పన్నాలాల్ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, టూరిస్టు హోటల్ ఫీడర్ పరిధిలో టూరిస్టు హోటల్, చప్పల్ బజార్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్ రోడ్, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు సంజీవని పశు సేవా కేంద్రం ప్రారంభం

కాచిగూడ: బర్కత్‌పురలోని ఘన్ శ్యామ్ పటేల్ భవన్ వద్ద ఈ నెల 20వ తేదీన శుక్రవారం సాయంత్రం 3 గంటలకు సంజీవని పశు సేవా కేంద్రంను కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రారంభిస్తారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. పశువులకు అవసరమైన వైద్య సహాయం అందించడం ఈ కేంద్రం లక్ష్యమని, పశువుల పెంపకందారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసరాలు అందిస్తున్న కల్పనాయాదవ్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని పేదలను ఆదుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ అన్నారు. ముషీరాబాద్‌లోని రెయిన్‌బో అనాథాశ్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, కార్మిక నేత దివంగత నేత ఆర్.ప్రభాకర్‌యాదవ్ వర్ధంతిని సందర్భంగా గురువారం వంద మంది అనాథ పిల్లలకు కల్పనాయాదవ్ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళీ మోజెస్, ఉమారాణి, కృష్ణవేణి, భారతి, రామానందరెడ్డి, రెయిన్‌బో హోం కోఆర్డినేటర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదుల మూక దాడులను అరికట్టాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నాస్తికులు, హేతువాదులు, టీచర్లు, అంబేడ్కర్ వాదులపై మతోన్మాదుల మూక దాడులను అరికట్టాలని భావ ప్రకటన స్వేచ్ఛ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భావ ప్రకటన స్వేచ్ఛ జేఏసీ ఆవిర్భావం సందర్భంగా గురువారం జేఏసీ పోస్టర్, లోగోను ఆవిష్కరించారు. జేఏసీ నాయకులు టి.రమేష్, డాక్టర్ సుధాకర్, టి.స్కైలాబ్‌బాబు, జి.ఝాన్సీలు మాట్లాడుతూ... మతోన్మాదం పేరుతో దాడులు చేస్తున్న దుండగులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న అన్ని జిల్లా కేంద్రాల్లో మానవహారాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మతోన్మాద దాడులు తీవ్రతరం అవుతున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం సరైంది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూక దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కోలా జనార్దన్, ఆర్.పాండురంగాచారి, కేఎస్ ప్రదీప్, రామకృష్ణ, మహేష్, వేదాంతం మౌర్యా, ఎండీ ఇస్మాయిల్, ఇ.రఘునందన్ తదితరులున్నారు.

ఆహ్వానం



కవితను ఆహ్వానిస్తున్న ప్రసన్నరామ్మూర్తి, అయోధ్య

చిక్కడపల్లి: తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం 6వ రాష్ట్ర మహాసభకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సంఘం కోరింది. గురువారం నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి, సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు శాంగంటి అయోధ్య, టీఎన్‌జీఓ సుభాష్‌కుమార్‌లు కవితను కలసి ఆహ్వానపత్రంను అందజేశారు. శుక్రవారం 12 గంటలకు చిక్కడపల్లి సిటీ లైబ్రరీలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయాల ఉద్యోగులు, పెన్షనర్లు, పార్ట్‌టైమ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రాష్ట్రంలో అంధత్వ నివారణే లక్ష్యం

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- కాచిగూడ వార్డు కార్యాలయంలో కంటి వెలుగును ప్రారంభించిన ఎమ్మెల్యే



కార్పొరేటర్ కన్నె ఉమాతో కలిసి శిబిరంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: రాష్ట్రంలో అంధత్వ నివారణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశ పెట్టారని అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కంటి వెలుగు రెండో విడతలో భాగంగా గురువారం కాచిగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వాళ్లకు కంటి ఆపరేషన్లు కూడా చేయించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత కాలంలో మొబైల్, టీవీ వంటి పరికరాల వాడకం బాగా పెరిగిందని, ఈ నేపథ్యంలోనే ప్రతి ఒక్కరికీ కంటి సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మనిషికి కళ్లు అనేవి చాలా ముఖ్యమని, అలాంటి కళ్లు పని చేయకపోతే జీవితం అంధకారం అవుతుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్, శ్రీకాంత్, కిషోర్, డాక్టర్ మనోజ్ రెడ్డి, డాక్టర్ సి.మాధవి, ఏఎన్‌ఎం జి.సునిత, పద్మ, సుహాసిని, సూపర్‌వైజర్ నర్సుబాయి, ఆశ వర్కర్లు డి.ఉమాదేవి, పుష్పవతి, ఎస్.మాధవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేనట్లుగా 'కంటి వెలుగు'

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో కంటివెలుగును ప్రారంభించిన ఎమ్మెల్యే



జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగును ప్రారంభించి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగును నియోజకవర్గ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం కంటి వెలుగు కేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని యజ్ఞంలా ప్రారంభిందన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. డీబీఆర్ మిల్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అవంతి మాట్లాడుతూ.. ప్రతి రోజు 200 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు ముఠా జయసింహ, వైద్యాధికారి అవంతి, డాక్టర్ హరికృష్ణ, ఏఎంఓహెచ్ మైత్రేయ, డీపీఓ సుధాకర్‌రావు, డీఈ సన్నీ, గాంధీనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీశ్ బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, రవి శంకర్‌గుప్తా, పున్న సత్యనారాయణ, సీహెచ్ హన్మంతు, భాస్కర్, బత్తుల కిరణ్‌కుమార్, జీవై గిరి, పీఎస్ శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, దేవయ్య, గణేశ్, యూసీడీ అధికారులకు మధు, ఎండీ ఉస్మాన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ఉపయోగించుకోవాలి



వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ సూచించారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లో జవహర్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కంటి పరీక్షల అనంతరం అనంతరం అవసరమైన వారికి కళ్ల అద్దాలను వైద్యులతో కలసి అందించారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు ఎ.వినయ్‌కుమార్, డీబీఆర్ మిల్స్ యూపీహెచ్‌సీ డాక్టర్ అవంతి, డాక్టర్ మనోజ్, సిస్టర్ కృపా, ఆశ వర్కర్లు దుర్గా, స్వప్న, బీజేపీ నాయకులు ఎం.ఉమేష్, మహమూద్, సత్తిరెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, నర్సింహ, సంతోష్, మంగమ్మ, సంధ్యారాణి, సంయుక్తరాణి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దూర దృష్టితోనే కంటి వెలుగు

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. కంటి వెలుగు రెండో విడతలో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్లు, అధికారులతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందరి సంక్షేమం కోసం పాటుపడుతుందని, సీఎం కేసీఆర్ దూరదృష్టితో వంద రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, డీఎంసీ వేణుగోపాల్, గోల్నాకలోని కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాకలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు



కంటి వెలుగు కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత

నల్లకుంట: 'సర్వేంద్రియానామ్ నయనం ప్రధానం' అని, కంటి జబ్బులను నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారమవుతుందని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'కేసీఆర్ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని గాలికొదిలేసింది'



ప్రవీణ్ కుమార్

కాచిగూడ: రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని సీఎం కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తోందని బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ అనేక రకాల మోసపూరిత వాగ్దానాలను ఇస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మలక్‌పేట హాస్పిటల్‌లో గర్భిణులు, ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి అనేక మంది ప్రాణాలు కోల్పోయినా.. సంబంధిత వ్యక్తులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో అమలు చేయకుండా మెరుగైన వైద్యానికి ప్రజలను దూరం చేస్తున్నారన్నారు. కనీసం పేదవారికి ఉచిత విద్యను అందించే సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కోసం ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ప్రవీణ్ కుమార్ హితవు పలికారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని తెస్తామని గొప్పలు చెప్పిన కేసీఆర్‌కు ఇప్పుడు ఆ మాటలు ఎందుకు గుర్తుకు రావడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల అంశంలో కేసీఆర్ ప్రభుత్వం ద్వంద వైఖరిని అవలంభిస్తే చూస్తూ ఊరుకోమని ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటుందని, కార్పొరేట్ కళాశాలల్లో, పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

నూతన కమిటీ ఎన్నిక



సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మల్టీపర్పస్ మ్యాక్ సొసైటీ నూతన కమిటీ సభ్యులు

కాచిగూడ: సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ మల్టీపర్పస్ మ్యాక్ సొసైటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. రాష్ట్రంలోని సిండికేట్ బ్యాంకు ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు సొసైటీ చేయూతను అందిస్తోందని తెలిపారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బ్యాంకు సిబ్బంది గరిష్టంగా రూ.4లక్షల రుణాన్ని ఒక శాతం వడ్డీతో ఇస్తున్నామని, ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే అతను తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. సొసైటీ మేనేజింగ్ కమిటీ నూతన సభ్యులుగా వినోద్ (హైదరాబాద్), హనుమంతరావు (సంగారెడ్డి), ఎస్.శ్రీనివాస్ (మల్కాజ్‌గిరి), వీరేశం (వరంగల్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటి, కార్యదర్శి పరమేశ్వర్, కోశాధికారి వినోద్, నరేష్‌బాబు, వెంకటరమణ, ఆర్.శ్రీనివాస్, అబ్దుల్, రాజన్న, వెంకటేశ్వర్ రావు, లక్ష్మణ్ యాదవ్, నవీన్, మురళీ, శ్రీనివాస్ నాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని దయార మార్కెట్‌లో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దయార మార్కెట్‌లో నెలకొన్న సమస్యపై స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ఆయన జలమండలి జీఎం రామకృష్ణ, చిలకలగూడ రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రావు, సెక్షన్ మేనేజర్ నవీన్‌లతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో దయార మార్కెట్ వరకే డ్రైనేజీ పైప్‌లైన్ వేయడం వల్ల నిత్యం డ్రైనేజీ నిండి కలుషిత నీటి సరఫరాకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కొత్త పైప్‌లైన్లు వేస్తున్నామని, దీంతో పవిత్రనగర్, ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శంకర్ ముదిరాజ్, పూస గోరఖ్‌నాథ్, సుధాకర్‌గుప్తా, సయ్యద్ అహ్మద్ భక్తియార్ తదితరులు ఉన్నారు.



తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ సీనియర్ సిటిజన్స్ కేలండర్‌ను గురువారం సభ్యులు గోవిందు రాములు, లక్ష్మీనారాయణ ముదిరాజ్, వెంకట్రావు, మోహన్ రావు, మోర సుదర్శన్, నీలం శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆవిష్కరిస్తున్న మహాసభ సీనియర్ నేత పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్. - కాచిగూడ

'హైకోర్టు తీర్పు మేరకు వ్యాపారాలు చేసుకోనివ్వండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రవిశంకర్

చిక్కడపల్లి: హైకోర్టు ఆదేశం మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని టీ-హబ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారులను వ్యాపారాలు చేసుకోనివ్వాలని బీఎంఎస్ జాతీ య కార్యవర్గ సభ్యుడు అల్లూరి రవిశంకర్ అన్నారు. భాగ్యనగర్ హాకర్స్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రమ శక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్ట్రీట్స్ వెండర్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జి ఎ.శంకర్‌తో కలసి ఆయన మాట్లాడుతూ... పదిహేనేళ్లుగా టీ-హబ్ ఎదురుగా రోడ్డులో టిఫిన్స్, స్నాక్స్ ఇతర చిరు వ్యాపారులు చేసుకుంటూ బతుకున్నారని, 40 మంది చిరువ్యాపారులు ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. దీనిపై గతంలో చిరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించగా గతేడాది నవంబర్ 28వ తేదీన వీధి అమ్మకం దారుల చట్టం -2014 అమలు చేయాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. కాగా జనవరి 14 ట్రాఫిక్ పోలీసులు కూల్చివేశారని, చిరు వ్యాపారులు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, రమేశ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు సలిపెల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్యపార్కులో యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌లతో పాటు గుండెకు సంబంధించిన 2డీ ఏకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు కందుకూరి నర్సింహ, హౌస్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాఘవరెడ్డి, క్లబ్ ప్రధాన కార్యదర్శి నిరంజన్ రెడ్డి, క్లబ్ కోశాధికారి డాక్టర్ సునీల్, శంకర్ గంగపుత్ర, కృష్ణ, ఉదయ్ తదితరులు ఉన్నారు.

22న ముగ్గుల పోటీలు

చిక్కడపల్లి: ముషీరాబాద్ పద్మాశాలీ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు బోనం ఊర్మిళ తెలిపారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి ఒంటి గంట వరకు పోటీలు జరుగుతాయని, పద్మశాలీ మహిళలు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ మేరకు గాంధీనగర్‌లోని ప్రతి ఇంటికి వెళ్లి మహిళలను పోటీలకు ఆహ్వానించారు.



22న వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కన్నె రమేష్‌యాదవ్

కాచిగూడ: శ్రీవీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహిస్తున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కన్నె రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడలోని బీజేపీ కార్యాలయంలో శ్రీవీరభద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 21వ తేదీన శనివారం సాయంత్రం 4 గంటలకు మంగళ వాయిద్యాలతో వేద స్వస్తి, విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి మహా పుణ్యాహావచనం, పంచగవ్య ప్రాశన దీక్షాకంకణధారణ, రుత్వీకరణ అఖండ దీపారాధన, పంచావరణ మహా మండప ఆరాధన, నూతన ఉత్సవ విగ్రహాల జలాధివాసం, అగ్ని ప్రతిష్టాపన, మూల మంత్ర హవనములు, ధాన్యాధివాస సహిత శయ్యాధివాసములు, నీరాజనా మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 22వ తేదీన ఆదివారం ఉదయం 7 గంటలకు గవ్యాంతపూజలు, మూల మంత్ర సహిత రుద్రహవనములు, మహాపూర్ణాహుతి, కల్యాణ విగ్రహాలకు విశేష స్నపనము, ఎదుర్కోళ్ల ఉత్సవం, ఉదయం 10.30 గంటలకు శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి దివ్య కల్యాణ మహోత్సవం, తీర్థప్రసాద వితరణ, వేద పండితులచే ఆశీర్వచనం శ్రీ వీరభద్ర స్వామి అన్నప్రసాద వితరణ ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి శోభాయాత్ర మహోత్సవం తదనంతరం పవళింపు సేవ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరుణ, హరిబాబు, విజయ్ పటేల్, మించు ఆనంద్, ఆది నాగేష్, కాసుల మల్లికార్జున్, కొండూరు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌ను గ్రామీణ యువతకు చేరువ చేయాలి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారీఖ్ అన్వర్

అంబర్‌పేట: ఖరీదుగా మారిన క్రికెట్ క్రీడను గ్రామీణ యువతకు చేరువ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారీఖ్ అన్వర్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో మాజీ ఎంపీ వి.హనుమంతారావు క్రికెట్ ఫెడరేషన్‌ను స్థాపించి గత 15 ఏళ్లకు పేద క్రీడాకారులకు చక్కని వేదిక కల్పించడం హర్షనీయమన్నారు. గురువారం అంబర్‌పేట జలమండలి క్రికెట్ మైదానంలో 40వ రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా అండర్-19 నేషనల్ టీ-20 ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్ కప్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వీహెచ్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా నిర్వహిస్తున్న తమ టోర్నమెంట్‌ను ప్రతిభ ఉన్న క్రీడాకారులు వినియోగించుకుని జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వెల్లడించారు. ప్రస్తుతం ఇండియా టీంలో ఉన్న సిరాజ్ తాము తయారు చేసిన క్రీడాకారుడే అని, ఇతడితో పాటు ఇతర దేశాల్లో జాతీయ స్థాయిలో తమ ఫెడరేషన్ క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రస్తుతం తమ టోర్నమెంట్‌లో శ్రీలంక దేశంతో పాటు మన దేశంలోని 11 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. మొత్తం 12 జట్లు ఈ టీ-20 టోర్నీలో తలపడనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సయ్యద్ సాదిక్ పాషా, ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కుమార్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు అది అవినాష్, ప్రధానకార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ర్యాలీలను జయప్రదం చేయాలి



ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ట్రాక్టర్, వాహనాల ర్యాలీలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు టి.సాగర్ పిలుపునిచ్చారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. రైతుల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉప సంహరించుకునే సందర్భంగా 21 నవంబర్ 2021లో రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పశ్య పద్మ, రాయల చంద్రశేఖర్, మండల వెంకన్న, పెద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య, జె.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.